# కేసీఆర్‌ది సంక్షేమం.. విపక్షాలది సంక్షోభం

## కారు కావాలా? బేకార్ గాళ్లు కావాలా?.. బీఆర్ఎస్‌వి స్కీంలు.. బీజేపీ, కాంగ్రెస్‌వి స్కాంలు.. తెలంగాణను కాంగ్రెస్ 60 ఏండ్లు ఆగం చేసింది: కేటీఆర్

- ఇప్పుడు ఒక్క అవకాశం అంటూ నేతల మొసలి కన్నీళ్లు
- తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోదీ విషం కక్కుతున్నారు..
- పింఛనుపై త్వరలోనే సీఎం నుంచి శుభవార్త వింటారు
- వరంగల్ పశ్చిమ, తూర్పు సభల్లో మంత్రి కేటీఆర్
- 15,072 మంది లబ్ధిదారులకు కానుకల పంపిణీ





హనుమకొండలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు. సభలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్ వైపు ఉండాలో.. స్కాంలు, అబద్ధాలు, మోసాలతో కాలం గడిపే బీజేపీ, కాంగ్రెస్ వైపు ఉండాలో ప్రజలు తేల్చుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కోరారు. వచ్చే ఎన్నికలు చాలా కీలకమైనవని, ప్రజలు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కేసీఆర్‌ది సంక్షేమమని, ప్రతిపక్షాలది సంక్షోభమని స్పష్టం చేశారు. ఎన్నో పథకాలను అమలు చేస్తున్న కారు పార్టీ ఇటువైపు ఉంటే.. 60 ఏండ్లు తెలంగాణను పీక్కుతిన్న కాంగ్రెస్.. మోసాలు చేసే బీజేపీ బేకార్‌గాళ్లు అటువైపు ఉన్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్‌తో కలిసి మంత్రి కేటీఆర్ గ్రేటర్ వరంగల్‌లోని దాదాపు వెయ్యి కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించి, పలు శంకుస్థాపనలు చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ బహిరంగసభలో, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను గమనిస్తూ ఉండాలని సూచించారు. తెలంగాణపై సందు దొరికితే మోదీ విషం చిమ్ముతున్నారు. రాష్ట్రానికి గుండు సున్నా ఇచ్చిన మోదీ దేవుడని బండి సంజయ్ అంటున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం చేసింది కేసీఆరేనని, ఇకముందు చేయబోయేది కూడా కేసీఆరేనని, మళ్లీ సీఎం కాబోయేది కేసీఆరేనని చెప్పారు.

> “రాబోయే పదేండ్లలో హైదరాబాద్‌కు, వరంగల్‌కు పెద్ద తేడా ఉండదు. ఐటీ రంగంలో భవిష్యత్తు టైర్-2 నగరాలదే. రానున్న రోజుల్లో వరంగల్‌కు హైస్పీడ్ రైలు వస్తుంది. ఎన్నారైలు ఏపీ, బెంగళూరులోనూ ఐటీ సంస్థలు పెట్టాలి. కావాలంటే జగనన్నకు చెప్పి జాగా ఇప్పిస్తా.
>
> - మంత్రి కేటీఆర్”

### ప్రజలు మళ్లీ దీవించాలి

తెలంగాణ ఉద్యమ ప్రతిదశలో కేసీఆర్ వెంట నడిచిన వినయ్‌భాస్కర్ మాస్ లీడర్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో వినయన్నను రికార్డు మెజారిటీతో గెలిపించాలని కోరారు. అన్న అంటే నేనున్నానంటూ ఉరికి వచ్చే నాయకుడు వినయన్న అని ప్రశంసించారు. ఏ సందర్భంలో ఎప్పుడు పిలిచినా వినయన్న వెంటనే వస్తారని తెలిపారు. నరేందర్‌ను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### ఏ గట్టున ఉంటారో తేల్చుకోవాలి

‘ఎన్నికలు రాగానే ఆగం కావద్దు. రంగస్థలం సినిమాలో నాగన్నా ఏ గట్టున ఉంటావో తేల్చుకోవాలి అన్నట్టు మన హనుమకొండ నాగన్నలు కూడా తేల్చుకోవాలి. రైతుబంధు, అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న వినయ్ భాస్కర్ ఈ గట్టున ఉన్నరు’ అని మంత్రి కేటీఆర్ తెలిపారు. తాగునీరు, సాగునీరు, కరెంట్, సంక్షేమ పథకాలు ఇప్పుడున్నట్టు చేసుడు కాంగ్రెస్‌తోటి అయితదా? పేదల గురించి బీజేపీ ఆలోచిస్తదా? అని ప్రశ్నించారు. ‘కరెంట్ గురించి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు బంపర్ ఆఫర్ ఇస్తున్నా. బస్సులు పెట్టిస్త.. ఏ ఊరికి పోతరోపోయి వరుసగా నిలబడి కరెంట్ వైర్ పట్టుకోండి. కరెంట్ ఎక్కడ లేదో అప్పుడు తెలుస్తది. కరెంట్ తీగ చూడటానికి కేసీఆర్‌లా సన్నగా ఉంటది. ముట్టుకుంటే తెలుస్తది. జాడిచ్చి కొడుతది’ అని వెల్లడించారు. వరంగల్‌లో 24 అంతస్థుల బిల్డింగ్‌లో అతిపెద్ద సర్కారు దవాఖాన కడుతున్నామని, దసరాకు ప్రారంభించేలా పనులు చేస్తున్నామని తెలిపారు. ఆసరా పింఛను మరింత పెంచేలా సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని, త్వరలోనే దీనిపై ఆయన ప్రకటన చేస్తారని స్పష్టం చేశారు. వరంగల్‌తూర్పు నియోజకవర్గంలో ఒకే రోజు 15,072 మందికి సంక్షేమ పథకాలు అందించటం సంతోషంగా ఉన్నదని కేటీఆర్ అన్నారు.

### వరంగల్, హనుమకొండ ఉద్యమ కేంద్రాలు

‘వరంగల్, హనుమకొండ రెండు నియోజకవర్గాలు ఉద్యమానికి కేంద్రాలుగా నిలిచాయి. కేసీఆర్‌కు ఉత్సాహాన్ని, ఉద్యమానికి ఊపిరిలూదిన ప్రాంతం ఇది. సర్వదా, శతదా మీకు రుణపడి ఉంటాం. ఈ రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రూ.900 కోట్లతో వివిధ కార్యక్రమాలు ప్రారంభించుకున్నాం’ అని కేటీఆర్ వివరించారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ వంటి నగరాల్లో ఐటీ కంపెనీలు విస్తరించేలా వసతులు కల్పిస్తున్నామని అన్నారు.

### కేయూ విద్యార్థులకు భరోసా

మంత్రి కేటీఆర్ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులకు భరోసా కల్పించారు. మడికొండ ఐటీ పార్క్ వద్ద కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు కలిశారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన పరిణామాలు వివరించారు. దానిపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని వరంగల్ సీపీకి ఆదేశించారు. వర్సిటీలోని సమస్యలపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రితో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సిక్కులు, ఆశావర్కర్లు సమస్యలు వివరించగా, త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. బీజేపీ నాయకుడు ఈగ మల్లేశం బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి కండువాను కప్పి బీఆర్ఎస్‌లోకి స్వాగతించారు. కార్యక్రమాల్లో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, పసునూరి దయాకర్, మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నన్నపునేని నరేందర్, అరూరి రమేశ్, బానోత్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

> “వరంగల్ సిటీల భార్యాభర్త ఉన్నరు. ఆయన ఆటోడ్రైవర్, ఆమె ఇండ్లలో పని చేసుకుంటున్నది. ఒకరోజు ఇద్దరు కూర్చుని ఉన్నపడు పైనుంచి ఎర్రతేలు పడ్డది. అయ్యో తేలు కుట్టి సంపుతదని భార్య అన్నది. భర్త మాత్రం బయటికి ఉరికిండు. తేలును చంపుమంటే బైటికి పోతున్నవేంది అని ఆమె అడిగింది. బయట మొగోళ్లు ఉన్నరో చూసొస్తా అని అన్నడు. అచ్చం ఇలాగే కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏం చేయాలన్న ఢిల్లీల అడిగి చెప్పాలె. వాళ్లకు బీఫారాలు ఢిల్లీలనే ఇయ్యాలె. బీఆర్ఎస్ మాత్రం తెలంగాణ ప్రజల అసలైన అవ్వల్‌దర్జా టీం.
>
> - మంత్రి కేటీఆర్”





శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ సభలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్. సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజానీకం

# బీజేపీ డకౌట్.. కాంగ్రెస్ రనౌట్

- ఈ ఎన్నికల్లో రెండు పార్టీలూ గల్లంతే
- బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం పక్కా
- సీఎం కేసీఆర్ సిక్సర్ కొట్టడం ఖాయం
- కేసీఆర్ నమ్మకమైతే కాంగ్రెస్ నాటకం
- త్వరలో ప్రతిపక్షాల దిమ్మతిరిగే గులాబీ పార్టీ మ్యానిఫెస్టో ఉంటది
- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు





జగిత్యాల జిల్లా కోరుట్ల మినీ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల. సభకు హాజరైన జనం

కరీంనగర్/నిజామాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ డకౌట్.. కాంగ్రెస్ రనౌట్ కావడం ఖాయమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సిక్సర్ కొట్టడం ఖాయమని, బీఆర్ఎస్ హ్యాట్రిక్ పక్కా అని తెలిపారు. కేసీఆర్ అంటే నమ్మకం.. కాంగ్రెస్ అంటే నాటకమని అభివర్ణించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచింది ఒక్క సీటేనని.. ఈ సారి ఆ సీటు కూడా గల్లంతు కావడం ఖాయమని అన్నారు. ఎన్ని జాకీలుపెట్టి లేపినా తెలంగాణలో బీజేపీ లేవబోదని చెప్పారు. శుక్రవారం ఆయన జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో వంద పడకల దవాఖానను ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంటలో వ్యవసాయ మార్కెట్, మహిళా సంఘ భవనాలు, పల్లె దవాఖానకు ప్రారంభోత్సవాలు చేశారు. ₹21కోట్లతో 50 పడకల దవాఖాన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో పర్యటించిన హరీశ్‌రావు.. తొలుత కామారెడ్డి జిల్లా బిచ్కుందలో వంద పడకల దవాఖానకు ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎంపీ బీబీపాటిల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో వంద పడకల దవాఖాన నిర్మాణ పనులను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో హరీశ్‌రావు ప్రసంగించారు. తొమ్మిదేండ్లలో కేసీఆర్ సర్కారు చేసిన ప్రగతిని ఏకరువుపెట్టారు. ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు.

### రేవంత్ సవాల్‌కు నేను సిద్ధమే

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రంగులు మార్చే ఊసరవెల్లి అని మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ పదేండ్ల పాలన, బీఆర్ఎస్ పదేండ్ల పాలనపై చర్చ పెడతామని రేవంత్ విసిరిన సవాల్‌కు తాను సిద్ధంగా ఉన్నానని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు అరిగోసపడ్డారని గుర్తుచేశారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటూ ప్రగల్భాలు పలుకుతున్న రేవంత్‌రెడ్డి తానడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు టీడీపీలో ఉన్న ఆయన ఏం మాట్లాడాడో గుర్తు చేసుకోవాలని సూచించారు. ఆనాడు అసెంబ్లీలో ఏం మాట్లాడారో.. ఒకసారి రికార్డులు చూసుకోవాలని చురకలంటించారు. ‘పావురాల గుట్టల్లో పావురమై ఎగిరి పోయిండని రాజశేఖర్‌రెడ్డి గురించి నువ్వు మాట్లాడలేదా? నీది నోరా.. లేక మోరా?’ అని రేవంత్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆ రోజు ఆలా మాట్లాడి.. ఈ రోజు కాంగ్రెస్ పాలన బాగుందని అంటున్నావని, ఇందులో ఏది నిజం? అని నిలదీశారు. నాడు మాట్లాడిందే నిజమైతే కాంగ్రెస్ పాలనే బాగాలేదన్నట్టు అని, ఇక చర్చకు ఆస్కారమేలేదని పేర్కొన్నారు. ఇప్పుడు మాట్లాడింది నిజమైతే రేవంత్ ఊసరవెల్లులకే ఊసరవెల్లి అని అర్థమైతున్నదని, ఈ ఝూటా మాటలు ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకొని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తీర్పుచెప్తారని అన్నారు.

> “స్కూళ్లలో అల్పాహార పథకాన్ని ప్రారంభించుకున్నం. ఇతర రాష్ట్రాల్లో, పక్కనే ఉన్న మహారాష్ట్రలో మధ్యాహ్న భోజనంలో తెల్ల అన్నం, గొడ్డుకారంతో పెడితే.. మనం కేసీఆర్ పాలనలో సన్నబియ్యంతో మమకారంతో పిల్లలకు పోషకాహారం అందజేస్తున్నం. అల్పాహారం పథకంలో భాగంగా పిల్లలకు రుచికరమైన ఇడ్లి, పూరివంటి టిఫిన్లు పెట్టబోతున్నం. విద్యార్థులపై బీజేపీది గొడ్డుకారమైతే.. మన తెలంగాణ సర్కారుది మమకారం.
>
> -మంత్రి హరీశ్‌రావు”

### కాంగ్రెస్ అంటేనే కరెంట్ కోతలు

నాటి పదేండ్ల కాంగ్రెస్ పాలనకు.. ఇప్పటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు మధ్యే పోటీగా ఎన్నికలు జరుగుతాయని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు కరెంటు కోతలు. అలవికాని బాధలు అనుభవించారని గుర్తుచేశారు. మళ్లీ ఆ బాధలు వద్దనుకొంటే బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా గెలిచేది, హ్యాట్రిక్ కొట్టేది బీఆర్ఎస్ పార్టీనేనని ధీమా వ్యక్తంచేశారు. దేశంలోనే ఎక్కడాలేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. గత పాలకులు బీడీ కార్మికుల కష్టాలను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పుర్రె గుర్తు పెట్టి.. ఉన్న శాట గుంజుకునే ప్రయత్నం జేసిందని విమర్శించారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా బీడీ పరిశ్రమపై బీజేపీ జీఎస్టీ వేసి దెబ్బతీసిందని దుయ్యబట్టారు. బీడీ కార్మికులకు అండగా నిలుస్తూ పింఛన్ ఇస్తున్నది కేవలం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. త్వరలో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగే మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నట్టు తెలిపారు. కోరుట్లలో జరిగిన సభకు బీఆర్ఎస్‌అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఇల్లంతకుంటలో జరిగిన సభకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే విద్యాసాగర్ పాల్గొన్నారు.

### సంక్షేమంలో స్వర్ణయుగం..

సీఎం కేసీఆర్ పాలన సంక్షేమంలో స్వర్ణయుగం, అభివృద్ధిలో అద్భుతాలను సృష్టించిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేండ్ల పరిపాలనలో ప్రతి కుటుంబానికి మేలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారు అంటూ చెప్పుకొనే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలెవ్వరూ సంతోషంగా లేరని అన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవలు సరిగా లేక పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ పరిపాలనలో డబుల్ ఇంజిన్ సర్కారు విఫలమైందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పరిపాలనలో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు.

### మనపై మోదీ, రాహుల్‌కు ప్రేమ ఉంటదా?

‘మొన్న నిజామాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు. వాళ్ల డబుల్ ఇంజిన్ సర్కార్లే ఫెయిల్ అయ్యాయి. పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో ఎలాంటి పరిస్థితి ఉన్నదో రోజూ చూస్తూనే ఉన్నం. బీజేపీ పాలిస్తున్న మహారాష్ట్రలో మందుల్లేవు, సూదుల్లేవని దవాఖాన పర్యవేక్షకుడే చెబుతుండటం బీజేపీ ప్రభుత్వ వైఫల్యాన్ని తేటతెల్లం చేస్తున్నది. కేంద్రంలో, మహారాష్ట్రలో బీజేపీ ఉన్నప్పటికీ దవాఖానలు బాగు చేసుకోలేని దుస్థితిలో ఉందంటే ప్రజలంతా అర్థం చేసుకోవాలి’ అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణకు ఢిల్లీలో అవార్డులు వస్తాయి కానీ బీజేపీ నాయకులు గల్లీకి వచ్చి తిడతారని మండిపడ్డారు. తెలంగాణపై మోదీ, రాహుల్ గాంధీకి ప్రేమ ఉంటదా? లేదా కేసీఆర్‌కు ఉంటదా? అని ప్రశ్నించారు.

### కాంగ్రెస్‌వి ఫేక్ సర్వేలు

‘కాంగ్రెస్ పార్టీ ఫేక్ సర్వేలు చేస్తున్నది. మాకే సీట్లు ఎక్కువ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నది. గాంధీభవన్‌లో మొన్నటి దాకా అప్లికేషన్ ఫీజుల కోసం డబ్బులు వసూలు చేసింద్రు. ఇప్పుడు సీట్ల కోసం డబ్బులు అడుగుతుంద్రు. సీట్లను అమ్ముకుంటుంద్రు. బీఆర్ఎస్ వద్దని వదిలేసిన వాళ్లను స్వాగతం పలికి చేర్చుకుంటున్నరు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ కొట్టేది మాత్రం కేసీఆరే’ అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకప్పుడు దవాఖానకు వెళ్లాలంటే 50 కిలోమీటర్లు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అలాంటి కష్టం ఉండొద్దని 100 పడకల పెద్ద దవాఖానను ధర్పల్లికి తీసుకువచ్చామని, రూ.33కోట్లతో ఈ దవాఖానను ఏడాదిలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ‘కాంగ్రెస్ పాలనలో మందుల్లేవు, డాక్టర్లు లేరు. పల్లె దవాఖానా, బస్తీ దవాఖానా, వంద పడకల హాస్పిటల్, జిల్లాకో మెడికల్ కాలేజీ, నాలుగు టిమ్స్ దవాఖానలను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖనలో 1200 ఓపీ ఉంటున్నదని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ‘నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన’కు అని పాడుకొంటే.. నేడు ‘పోదాం పద సర్కారు దవాఖాన’కే అని నిరుపేదలు పాడుకొంటున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ విజన్‌తో నేడు పేదలకు వైద్యవిద్య చేరువైందని, ఏటా 10 వేల డాక్టర్లు తయారు చేసే పరిస్థితి తెలంగాణలో ఉన్నదని చెప్పారు.



శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

### డాక్టర్ సంజయ్, రసమయిని ఆశీర్వదించండి

డాక్టర్ సంజయ్ యువకుడు, ఉత్సాహవంతుడు.. డాక్టర్‌గా ఆయనకు మంచి పేరుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. చేతినిండా పని, జేబుల నిండా పైసలున్నా.. కోరుట్ల ప్రజలకు సేవ చేసేందుకు వచ్చారని అన్నారు. మీ ముందుకు వచ్చిన సంజయ్‌ను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే.. నియోజకవర్గం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలకు తలలో నాలుకలా ఉంటారని, నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికోసం తపించే వ్యక్తి అని పేర్కొన్నారు. పదేండ్లలో ఆయన చేసిన అభివృద్ధి పనులు ప్రజల కండ్ల ముందు ఉన్నాయని చెప్పారు. ఇతర పార్టీలు చెప్పే మాటలు నమ్మి మోస పోవద్దని, మీ బిడ్డగా మీ ఇంటి ముందుండే రసమయిని మరోసారి గెలిపించాలని కోరారు.

### అన్ని స్థానాల్లో గెలుపు

శ్రీరాముడికి హన్మంతుడు ఎట్లనో కేసీఆర్‌కు హరీశ్‌రావు అలాంటి వారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో మంత్రిగా హరీశ్‌రావు ఎంతో శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు వైద్యసేవలు అందించేందుకు వైద్యశాఖను ఉన్నతంగా తీర్చిదిద్ది సీఎం కలను నెరవేర్చారని తెలిపారు. నిజామాబాద్‌లో ఉన్న 9 అసెంబ్లీ స్థానాల్లో అన్నిచోట్లా బీఆర్ఎస్ పార్టే గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బాజిరెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు.

> “తెలంగాణలో ప్రతి గుంటకూ నీళ్లు ఇచ్చింది వాస్తవం. పండిన ప్రతి పంటా కొన్నది వాస్తవం. మోసపోతే ఆగమైతం. కైలాసం ఆటలెక్క పెద్ద పాము మింగే అవకాశం ఉన్నది జాగ్రత్త. పాతాళలోకం నుంచి కేసీఆర్ అద్భుతంగా తెలంగాణనుపైకి తీసుకువచ్చారు. త్వరలో ప్రతిపక్షాలకు దిమ్మదిరిగే మ్యానిఫెస్టో ఉంటుంది. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా హ్యాట్రిక్ కొట్టేది కేసీఆర్ మాత్రమే.
>
> -మంత్రి హరీశ్‌రావు”